

పెంటారెడ్డి కాలనీలోని శ్రీమాతా నిమిషాంబికా దేవి శుక్రవారం ఆషాఢ మాసం రెండో శుక్రవారం శాకాంబరీ అలంకరణలో దర్శమిచ్చారు. ప్రత్యేక పూజలు, కుంకుమార్చన నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. –బోడుప్పల్

బోడుప్పల్‌లో గాడితప్పిన పాలన

అక్రమాలను ప్రోత్సహిస్తున్న ప్రజాప్రతినిధులు

- ముందుకు సాగని అభివృద్ధి పనులు
- ఏమీ చేయలేని దుస్థితిలో అధికారులు
- స్థానికుల నుంచి వ్యక్తమవుతున్న నిరసనలు

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థలో పరిపాలన గాడి తప్పింది. అధికారులు, పాలకవర్గం మధ్య సమన్వయం లేకపోవడంతో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. కొంతమంది ప్రజాప్రతినిధులు అక్రమాలను ప్రోత్సహిస్తూ అందిన కాడికి దండుకుంటున్నారు. దీంతో కింది స్థాయి అధికారులు ఏమీ చేయలేని స్థితిలో ఉన్నారు. అభివృద్ధి పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతుండటంతో స్థానికుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది.

అధికారులు, పాలకవర్గం మధ్య సమన్వయలోపం

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన మున్సిపల్ చట్టంలో పాలకవర్గానికి కేవలం కౌన్సిల్‌లో ప్రజా సమస్యలపై చర్చించి తీర్మానించడం, తీర్మానం చేసిన పనులు అమలు జరిగే విధంగా పర్యవేక్షణ చేసే అధికారం ఉంది. మిగతా పనులు మాత్రం అధికారులు చేయాల్సి ఉంది. ఇక్కడ మాత్రం మేయర్, పాలకవర్గం అన్ని పనులు మేం చెప్పినట్లు చేయాలంటూ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. దీంతో అధికారులు, పాలకవర్గం మధ్య సమన్వయం లోపించి పనులు జరగడం లేదు.



మూడున్నర ఏళ్లలో.. ఆరుగురు కమిషనర్లు

బోడుప్పల్ నగర పాలక సంస్థ పాలకవర్గం ఏర్పడి మూడున్నర ఏళ్లు కావొస్తోంది. ఇప్పటి వరకు ఆరుగురు కమిషనర్లు పని చేశారు. ఇక్కడ పనిచేసిన వారిలో ఎస్.శంకర్, బోనగిరి శ్రీనివాస్, రవీందర్, ఎం.శ్రీనివాస్, పద్మజారాణి ఉన్నారు. ప్రస్తుతం నాగారం కమిషనర్‌గా పనిచేస్తున్న వాణిరెడ్డి ఇక్కడ అదనపు బాధ్యతలను నిర్వహిస్తోంది. అధికార పార్టీ పాలకవర్గం ఒత్తిడి వల్ల ఏ అధికారి కూడా ఇక్కడ పని చేయడానికి ఇష్టపడటం లేదు.

అక్రమ నిర్మాణాలే.. ఆదాయ వనరులుగా..

బోడుప్పల్‌లో కొంత మంది మహిళా కార్పొరేటర్ భర్తలు కమిటీగా ఏర్పడి అక్రమ నిర్మాణాలను ఆదాయ వనరులుగా మార్చుకొని అక్రమాలకు పాల్పడుతున్నారు. 2022 సంవత్సరం మే 5వ తేదీన అప్పటి కమిషనర్ పద్మజారాణి బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో 156 అక్రమ కట్టడాలున్నట్లు గుర్తించి వాటిపై జిల్లా కలెక్టర్, జిల్లా టాస్క్‌ఫోర్స్ టీమ్‌కు రిపోర్టు చేసింది. టాస్క్‌ఫోర్స్ టీం, కలెక్టర్ వెంటనే స్పందించి 30కి పైగా అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. తర్వాత ఆ కమిషనర్ స్థానంలో నాగారం కమిషనర్ వాణిరెడ్డి ఇక్కడ బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి కొంతమంది స్థానిక కార్పొరేటర్లు గతంలో కూల్చిన అక్రమ నిర్మాణాలను మరలా యధావిధిగా కట్టించి జేబులు నింపుకుంటున్నారు. ప్రస్తుతం ఉన్న టౌన్‌ప్లానింగ్ విభాగం కేవలం ఫిర్యాదులు స్వీకరించడానికే తప్ప వాటిని అదుపు చేయలేకపోతుందనే ఆరోపణలు వస్తున్నాయి.

అధ్వానంగా ప్రధాన రహదారులు

బోడుప్పల్‌లో అధికారులు, పాలకవర్గం ప్రజా సమస్యలను గుర్తించి వాటిపై చర్చించి అత్యవసరం ఉన్న పనులను తొలుత చేపట్టాల్సి ఉంది. అలా కాకుండా ఇక్కడ పాలకవర్గం ప్రతి డివిజన్‌కు సమాన నిధులు కేటాయిస్తూ.. అవసరం ఉన్నా లేకున్నా పనులు చేస్తోంది. ఈక్రమంలో గడిచిన మూడున్నర ఏళ్లలో బోడుప్పల్ ప్రధాన రహదారులను గాలికి వదిలేశారు. ప్రధాన రహదారులన్నీ అధ్వానంగా మారాయి. నిత్యం వందలాది వాహనాలు, పాదచారులు వెళ్లే చిలుకానగర్ రహదారిని పట్టించుకోకుండా, టెలిఫోన్ కాలనీలోని హైటెన్షన్ వైర్ల కింద సుమారు కోటి రూపాయల వ్యయంతో జన సంచారం లేనిచోట బీటీ రోడ్డు వేయడం పట్ల స్థానిక ప్రజలు అధికారులు, పాలకవర్గాన్ని ప్రశ్నిస్తున్నారు.

బోనాలకు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

రాచకొండ కమిషనర్ డీఎస్ చౌహాన్



సమీక్ష సమావేశంలో సీపీ డీఎస్ చౌహాన్

అల్వాల్: రాచకొండ కమిషనరేట్ పరిధిలో త్వరలో జరగనున్న తెలంగాణ రాష్ట్ర బోనాల పండగ నిర్వాహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నేరేడ్‌మెట్‌లోని రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర బోనాల పండగ సందర్భంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అలాగే క్రైమ్ రివ్యూ సమావేశం కూడా నిర్వహించాలని తెలిపారు. పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. సున్నితమైన ప్రాంతాల్లో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని, సమర్థవంతమైన సిబ్బందిని బందోబస్తులో ఉంచాలని సూచించారు. ప్రజలు శాంతియుతంగా, సంతోషంగా బోనాల పండగ జరుపుకోవాలని, అవాంఛనీయ ఘటనలు జరుగకుండా ఉండేందుకు పోలీసులకు సహకరించాలని తెలిపారు. మహిళల పట్ల ఎవరూ అసభ్యకరంగా ప్రవర్తించకుండా ఉండేందుకు షీ టీమ్స్ బృందాలు విధుల్లో ఉండాలని సూచించారు. పాత నేరస్తులపై నిఘా ఉంచాలని అన్నారు. క్రమం తప్పకుండా వాహనాల నంబర్ ప్లేట్ చెకింగ్, ప్రతాల చెకింగ్ నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో రాచకొండ జాయింట్ సీపీ సత్యనారాయణ, డీసీపీ అభిషేక్ మొహంతి, డీసీపీ జానకి, డీసీపీ రాజేష్‌చంద్ర, గిరిధర్, డీసీపీ అనురాధ, డీసీపీ అడ్మిన్ ఇందిర, డీసీపీ అడ్మిన్ నర్మద, అదనపు డీసీపీ షమీర్, అదనపు డీసీపీ శ్రీనివాస్, అదనపు డీసీపీ లక్ష్మీ, ఏసీపీలు ఇన్‌స్పెక్టర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

ఉప్పల్: అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని, లేని పక్షంలో సహించేది లేదని చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ అధికారులకు సూచించారు. శుక్రవారం డివిజన్‌లోని పోచమ్మ టెంపుల్ కుమ్మరికుంటలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డును స్థానికులు, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. రోడ్డు వేస్తున్నప్పుడు ప్రజలకు అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ నిఖిల్‌రెడ్డి, ఏఈ రాజ్‌కుమార్, బన్నాల ప్రవీణ్ పాల్గొన్నారు.



చిలుకానగర్‌లో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ గీత, జీహెచ్‌ఎంసీ అధికారులు

క్లుప్తంగా...

పార్టీ శ్రేణులు ఐక్యతతో ఉండాలి

మాజీ మేయర్ బొంతు రామ్మోహన్



సమావేశంలో రామ్మోహన్

రామంతాపూర్: డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్ పూనం భవన్‌లో శుక్రవారం మాజీ కార్పొరేటర్ గంధం జ్యోత్స్న ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా బొంతు రామ్మోహన్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పార్టీ నేతలు, కార్యకర్తలు ఐక్యంగా రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. టీఆర్‌ఎస్ నాయకులు మేకల హన్మంత్‌రెడ్డి, మేకల మధుసూదన్‌రెడ్డి, గంధం నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

బాలాజీ ఆలయ హుండీ లెక్కింపు



అల్వాల్: అల్వాల్‌లోని బాలాజీ శ్రీవేంకటేశ్వర ఆలయ హుండీ లెక్కింపు శుక్రవారం జరిగింది. సౌత్ జోన్ ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ మధు, ఈవో సమక్షంలో లెక్కింపు జరపగా రూ.4.21 లక్షలకు పైగా ఆదాయం వచ్చినట్లు తెలిపారు. భక్తులు సురేందర్‌రెడ్డి, రాము, శివరామకృష్ణ, ఆలయ సిబ్బంది, పూజారులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతా



నాగలక్ష్మీనగర్ కాలనీలో బీటీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్‌ను అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేస్తున్నామని మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నాగలక్ష్మీనగర్ కాలనీలో బీటీ రోడ్డు పనులను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌ను అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. పనులను ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. మల్లాపూర్ ఏఈ స్రవంతి, వర్క్‌ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, స్థానికులు పీఆర్.ప్రవీణ్, పీజీ.సుదర్శన్, దయాకర్‌రెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో బీఆర్‌ఎస్ విఫలం



క్రిష్ణనగర్‌కాలనీలో బీజేపీ నాయకుల నిరసన

అల్వాల్: ప్రజా సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీజేపీ నాయకులు దండుల వెంకటేష్ అన్నారు. శుక్రవారం మచ్చబొల్లారం డివిజన్‌లోని క్రిష్ణనగర్ కాలనీలో బీజేపీ నాయకులు ఇంటింటికీ పాదయాత్ర నిర్వహించారు. క్రిష్ణానగర్‌కాలనీలో సమస్యలను పరిష్కరించాలని బీజేపీ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కవితసింగ్, పి.మల్లికార్జున్ యాదవ్, వినయ్ శంకర్, కరుణశ్రీ, మహేష్‌రాజ్, ఉదయ్ ప్రకాష్, అనురాధ, అనీల్‌రాజ్, గోపి, బాలక్రిష్ణ, తిరుపతిరెడ్డి ఉన్నారు.

విద్యార్థి దశ నుంచే నాయకత్వం లక్షణాలు అలవర్చుకోవాలి



విద్యార్థికి బ్యాడ్జిలను అందజేస్తున్న ఎక్సైజ్ శాఖా కమిషనర్ సర్ఫరాస్ అహ్మద్

మల్లాపూర్: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ డైరెక్టర్, కమిషనర్ సర్ఫరాస్ అహ్మద్ అన్నారు. శుక్రవారం నాచారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో ఇన్వెస్టిచర్ వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు జిజ్ఞాస కలిగి ప్రశ్నలు అడగాలని వినూత్నంగా ఆలోచించాలన్నారు. అనంతరం విద్యార్థులకు బ్యాడ్జీలను అందజేసి విద్యార్థులచే ప్రమాణం చేయించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు పలువుర్ని ఆకట్టుకున్నాయి. డీపీఎస్ ఛైమ్స్– సాహిత్య మండలి రూపొందించిన త్రైమాసిక వార్తా సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మల్కా కొమరయ్య, డైరెక్టర్ పల్లవి, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ మల్కా యశస్వి, కమాండెంట్ విజయ్‌కుమార్ వర్మ, నేవీ కమాండెంట్ ప్రవీణ్, డిప్యూటీ కమాండెంట్ అజయ్ బాలి, కమలేష్ బాలి, ప్రిన్సిపల్ సునీతారావు, వైస్ ప్రిన్సిపల్ నందితా సుంకర, గౌరి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భగాయత్ లే అవుట్‌లో మౌలిక వసతులు కల్పిస్తాం



అర్వింద్ కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేస్తూ..

ఉప్పల్: ఉప్పల్‌లో హెచ్‌ఎండీఏ భగాయత్ లే అవుట్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని ప్రిన్సిపల్ సెక్రటరీ అర్వింద్ కుమార్ తెలిపారు. శుక్రవారం భగాయత్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌తో కలిసి అర్వింద్ కుమార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఏళ్ల తరబడి మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామని, ఎన్ని ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. మౌలిక వసతులతో పాటు ఓపెన్ జిమ్, కమ్యూనిటీ హాల్ డెవలప్‌మెంట్, పార్కుల అభివృద్ధి, శ్మశాన వాటిక, స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేసారు. అర్వింద్‌కుమార్ సానుకూలంగా స్పందించి త్వరలో పర్యటించి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చినట్లు అసోసియేషన్ కన్వీనర్ మేకల మధుసూదన్ రెడ్డి, అసోసియేషన్ ప్రతినిధులు అర్జున్‌రెడ్డి, సల్ల వీరారెడ్డి, మేకల హన్మంత్ రెడ్డి, గంధం నాగేశ్వర్‌రావు, సందీప్ సింగ్ తదితరులు ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

కార్పొరేటర్ జితేంద్రనాథ్



ఓంసాయినగర్ కాలనీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ జితేంద్రనాథ్

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ అభివృద్ధికి కృషి చేస్తున్నామని స్థానిక కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ అన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని ఓంసాయి నగర్ కాలనీ ఓల్డ్ అల్వాల్ తదితర ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ అధ్వాన్నంగా ఉందని కాలనీ వాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఈ మహేష్, జలమండలి అధికారి రమేష్, కిషోర్, వర్క్స్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ, కాలనీవాసులు వాసు, శ్రీనివాసు, వీరేష్, మహేష్, హబిబ్, అన్వర్, కృష్ణ, హరీష్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఈసీ నగర్ పార్కును ప్రారంభించాలి

కాప్రా: చర్లపల్లి డివిజన్ ఈసీ నగర్‌లో నిర్మించిన జీహెచ్‌ఎంసీ పార్కును తక్షణమే ప్రారంభించాలని కాప్రా డెవలప్‌మెంట్ ఫోరం ప్రతినిధులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయంపై శుక్రవారం కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎస్.శంకర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. సుమారు ఎకరం విస్తీర్ణంలో రూ.1.37 కోట్ల నిధులతో నిర్మించిన పార్కును ప్రజలకు అందుబాటులోకి తీసుకురాకుండా నిరుపయోగంగా ఉంటుందన్నారు. కాప్రా సర్కిల్ డెవలప్‌మెంట్ ఫోరం ప్రతినిధులు గుమ్మడి ప్రసాద్, దొమ్మాటి కిరణ్‌కుమార్ రావు, డి.శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డీఎం సేవలు మరవలేనివి



ఈసు దంపతులను సన్మానిస్తున్న వెంకటేశ్వర్లు

బోడుప్పల్: చెంగిచర్ల డిపో మేనేజర్ ఈసు సేవలు మరవలేనివని ఆర్టీసీ గ్రేటర్ జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. చెంగిచర్లలో డిపో మేనేజర్ ఈసు పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన మహోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. సంస్థను అభివృద్ధి చేయడంలో ఉద్యోగులు, ప్రయాణికుల సమస్యలు పరిష్కరించడంలో కీలక పాత్ర పోషించేవారన్నారు. మాజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ యాదగిరి, సికింద్రాబాద్ రీజినల్ మేనేజర్ వెంకన్న, డిప్యూటీ రీజినల్ మేనేజర్ జగన్‌లు డిపో మేనేజర్ ఈసుతో పాటు పదవీ విరమణ పొందిన జేపీఎస్ రాజు, ఎస్‌కే రావు, బాల్‌రెడ్డిని సన్మానించి బహుమతులు అందజేశారు.

ఎదుర్కోలేకే కుట్రలు



హరిశంకర్‌రెడ్డి

మేడిపల్లి: నన్ను ఎదుర్కోలేకే కుట్రలు చేస్తున్నారని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం 25వ డివిజన్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. పీర్జాదిగూడ కార్పొరేషన్‌కు చెందిన బీజేపీ నాయకుడు జైపాల్ రెడ్డి నాపై పోటీ చేసి ప్రజాక్షేత్రంలో ఓడిపోయినా వంకర బుద్ధి మారలేదన్నారు. రాజకీయంగా ఎదుర్కోవడం చేతగాక లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలో 26 వేల బిల్డింగ్స్ ఉన్నాయని, ఇందులో భువన్ సర్వేలో 20వేల బిల్డింగ్‌లు మాత్రమే రెగ్యులరైజేషన్ అయ్యాయని, ఇంకా 6 వేల బిల్డింగ్‌లు కాలేదని తెలిపారు. తనవి రెండు బిల్డింగులు రెగ్యులరైజేషన్ కాలేదని, దీన్ని సాకుగా చూపి మట్లాడటం తగదని హెచ్చరించారు. సర్వే అనంతరం వచ్చే ట్యాక్స్‌లను చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. దమ్ముంటే రాజకీయంగా ఎదుర్కోవాలని అన్నారు.

ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేయాలి



బోడుప్పల్: ఉపాధ్యాయులు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేయాలని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, బోడుప్పల్ ప్రెసిడెంట్ లం[illegible]గిని అన్నారు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం బోడుప్పల్ మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఆమె 150 మంది విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్సిల్స్, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివిన ఎంతో మంది విద్యార్థులు ఉన్నతస్థాయిలో ఉన్నారన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింహా, లయన్స్ క్లబ్ ప్రతినిధులు శ్రవణ్‌కుమార్, రాంమూర్తి, లక్ష్మణాచారి, వలివేటి రాధకృష్ణ, మురళీధర్‌చారి, జైపాల్‌రెడ్డి, అబ్రహం లింకన్ పాల్గొన్నారు.

రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం

అల్వాల్: భూదేవి నగర్‌లో ఆదివారం ఉచిత వైద్య ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డాక్టర్ రమేష్ కుమార్ తెలిపారు. గుడ్‌సైట్ ఆప్టిషన్స్ ఆధ్వర్యంలో ప్రముఖ నేత్ర వైద్యురాలు డాక్టర్ బి.లక్ష్మీరెడ్డి వైద్య సేవలు అందించనున్నారు. రైల్వే గేట్ సమీపంలోని క్లియర్ సైట్ ఐ క్లినిక్ వద్ద ఆదివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నారు. కంటి పరీక్షలు చేయడంతో పాటు అవసరమైన వైద్య సేవలు అందించనున్నట్లు వారు తెలిపారు. ఈ అవకాశాన్ని స్థానికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జీహెచ్‌ఎంసీ టిప్పర్ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

మల్కాజిగిరి: చెత్త తరలించే జీహెచ్‌ఎంసీ టిప్పర్ ఢీకొనడంతో వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ మల్లయ్య వివరాల ప్రకారం.. ఈస్ట్ ఆనంద్‌బాగ్ ఆదర్శనగర్‌కు చెందిన శ్రీహరి రియల్ ఎస్టేట్ వ్యాపారి. ఈ నెల 30వ తేదీన ఉదయం తన ద్విచక్ర వాహనంపై మౌలాలి నుంచి తార్నాక వెళ్తున్నారు. తార్నాక నుంచి మౌలాలి వైపు వెళ్తున్న జీహెచ్‌ఎంసీ చెత్త తరలించే టిప్పర్ డ్రైవర్ అతివేగంగా మౌలాలి ఫ్లైఓవర్ దిగిన తర్వాత విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టాడు. ఆ వేగానికి రోడ్డు దాటి ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో శ్రీహరికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం మల్కాజిగిరిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాప్రా సర్కిల్‌లో బాల్‌రెడ్డి సేవలు భేష్



కాప్రా: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కాప్రా సర్కిల్ కార్యాలయ ఉద్యోగి బాల్‌రెడ్డి శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి సర్కిల్ కార్యాలయంలో శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించారు. కాప్రా సర్కిల్‌లో బాల్‌రెడ్డి చేసిన సేవలను ఎమ్మెల్యే కొనియాడారు. బాల్‌రెడ్డి విశ్రాంత జీవితం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావనీరెడ్డి, బీఆర్‌ఎస్ ఏఎస్‌రావునగర్ డివిజన్ అధ్యక్షుడు కాసం మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.